క్లుప్తంగా

రేపు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

యలమంచిలి: స్థానిక తమ్మినీడి ఉమా నరసింహ కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి పార్టీలో వివిధ హోదా కలిగిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, మహిళా నాయకులు, సోషల్ మీడియా, యూత్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఫిషింగ్ హార్బర్ నిర్మించాలి



ఆర్డీఓ దాసిరాజుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నరసాపురం: నరసాపురం తీరప్రాంతంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన ఫిషింగ్ హార్బర్‌ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆర్.కృష్ణయ్య బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్‌భవానీ కోరారు. ఈ మేరకు శుక్రవారం నరసాపురం ఆర్డీఓ దాసి రాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. అభివృద్ధిలో నరసాపురం ప్రాంతం వెనకమడిందని అన్నారు. ఎప్పుడో బ్రిటీష్ హయాంలోనే ముఖ్య వాణిజ్య కేంద్రంగా పేరొందిన నరసాపురం ప్రాంతంలో నేడు ఉపాధి కరువైందని అన్నారు. ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తే పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పెమ్మాడి మోహన్‌లాల్, గొర్ల దుర్గారావు, బోడెటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

పాలకొల్లు సెంట్రల్: లారీ, మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం నరసాపురానికి చెందిన లంక అప్పారావు (23) యువకుడు పూలు తెచ్చుకునేందుకు రాజమండ్రి వెళ్లాడు. రాత్రి 8 గంటల సమయంలో రాజమండ్రి నుంచి తిరిగి ఇంటికి వస్తుండగా పాలకొల్లు మండలం ఉల్లంపర్రు గ్రామంలో పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చేసరికి పాలకొల్లు నుంచి మార్టేరు వెళుతున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అప్పారావు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బావమరిది షేక్ హనీఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై బి సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన వర్క్‌షాప్

నరసాపురం: స్థానిక వైఎన్ బీఈడీ కళాశాలలో బోధనోపకరణాల ద్వారా బోధన అనే అంశంపై రెండురోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గన్న బీఈడీ కళాశాల కరస్పాండెంట్ కానూరి స్వామి నాయుడు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పులతో బోధనా పద్ధతులు కూడా అధ్యాపకులు మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల ట్రెజరర్ పి.రఘురామారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శాంతి, వైస్ ప్రిన్సిపాల్ ముత్యాలక ల్యాణ్ పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్‌కు కుర్చీల అందజేత



డయాలసిస్ సెంటర్‌కు కుర్చీలు అందిస్తున్న మానవత సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ సెంటర్‌కు శుక్రవారం పాలకొల్లు మండల మానవత సేవా సంస్థ సభ్యులు కుర్చీలను అందజేశారు. ఈ కుర్చీలను దాత ఎస్‌బీఐ రిటైర్డ్ ఉద్యోగి సుధీర్ అందించారని మానవత మండల అధ్యక్షుడు బొక్కా రమాకాంత్ తెలిపారు. ఈ కుర్చీలను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి డయాలసిస్ సెక్షన్ వైద్యురాలు డాక్టర్ రేణుకకు అందజేశారు. కార్యక్రమంలో సేవా కమిటీ చైర్మన్ ముత్యాల శ్రీనివాసు, ముత్యాల రామారావు, గుడాల హరిబాబు, ప్రతాప్‌రాజు, నరసింహరాజు, వాస్తవ ప్రదీప్, వారధి వెంకట రమణారావు తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ వెల్ఫేర్, ప్రొటెక్షన్‌పై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: బాలల హక్కులకు భంగం కలగకుండా ప్రివెన్షన్ మెజర్స్ తీసుకోవాలని డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇన్సిట్యూషన్ కేర్ మమతశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక బ్రాడీపేట సచివాలయంలో చైల్డ్ వెల్ఫేర్, ప్రొటెక్షన్ కమిటీ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మమతశ్రీ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి వారిని సంరక్షించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని అన్నారు. అలాగే పిల్లల దత్తత గురించి మరిన్ని వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వులఖండం సత్యవేణి, సచివాలయ ఉద్యోగులు బండి దుర్గాప్రసాద్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆ పని పబ్లిక్‌గానే..!

- పట్టణంలో కానరాని పబ్లిక్ టాయిలెట్స్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, నాయకులు



ఆంధ్రా బ్యాంకు రోడ్డులో నిరుపయోగంగా ఉంచడంతో శిథిలమైన ఓఎన్జీసీ సంస్థ నిర్మించిన మరుగుదొడ్లు

నరసాపురం: పట్టణంలో మార్కెట్ ప్రాంతానికి వచ్చిన జనానికి కనీసం మరుగుకూడా లేని పరిస్థితి. అవసరమైన ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలన్న ఆలోచన పురపాలకులు చేయడంలేదు. ఫలితంగా బజార్‌లో మరుగులేక జనం ఇబ్బందులు పడుతున్నారు. మహిళల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంటుంది. నరసాపురం పట్టణం 31 వార్డులతో విస్తరించి ఉంది. పట్టణాన్ని ఆనుకుని చుట్టుపక్కల 50 పంచాయతీలు ఉన్నాయి. చుట్టుపక్కల గ్రామాల వారు అందరూ తెల్లారితే ముఖ్యమైన పనులపైనా, సరుకులు కొనుగోలు చేసేందుకు పట్టణానికి చేరుకుంటూ ఉంటారు. కానీ పట్టణంలో బస్టాండ్ నుంచి ప్రధాన మార్కెట్ పొడువునా శివాలయం సెంటర్ వరకూ, ఇటు మొగల్తూరు రోడ్‌లో మేదర్ల వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ ఎక్కడా పబ్లిక్ టాయిలెట్స్ లేవు. దీంతో రోడ్డు పక్కనే జనం ఆ అవసరం తీర్చుకోవాల్సిన దుస్థితి. మహిళలు అయితే ఆ వెసులుబాటు కూడా లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ నరసాపురం అంటూ ఊదరగొట్టడం, ప్రచారాలు చేసుకోవడం తప్పిస్తే సమస్య పరిష్కరించాలనే ఆలోచన మాత్రం అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అమలు కాని హామీలు

గతంలో మునిసిపాలిటీ పట్టణంలో మార్కెట్ ఏరియాలో పలు ప్రాంతాల వద్ద పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని నిర్ణయించింది. అయితే ఈ అంశంపై పెద్దగా దృష్టి పెట్టలేదు. దీంతో పని జరగలేదు.

అవసరమైన ప్రాంతాల్లో టాయిలెట్స్ నిర్మాణం



పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలనే ఆలోచన కౌన్సిల్ దృష్టిలో ఉంది. దీనికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను గతంలోనే ఆదేశించాం. మరో ఏడాదిన్నరలో గోదావరి పుష్కరాలు కూడా వస్తున్నాయి. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి పని చేస్తాం. కౌన్సిల్‌లో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటాం.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

2015 పుష్కరాల సమయంలో కూడా కోట్లాది రూపాయలతో పనులు చేశారు. కానీ ప్రజల శాశ్వత అవసరాలను దృష్టిలో పెట్టుకుని పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలనే ఆలోచన అప్పటి పురపాలకులు చేయలేదు. మార్కెట్ ప్రాంతంలో టాయిలెట్స్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో కూడా మరుగుదొడ్లులేవు. షాపుల్లో పనిచేసే మహిళలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి ఓఎన్జీసీ సంస్థ ఆంధ్రాబ్యాంకు రోడ్డులో 2017లో మురుగుదొడ్లు నిర్మించి ఇచ్చింది. వాటి నిర్వహణ కూడా పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారి శిథిలమయ్యాయి.

ప్రజల పక్షాన పోరాటం చేయాలి



నూతన అధ్యక్షులను అభినందిస్తున్న గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవినీతి అక్రమాల్లో కూరుకుపోయి ప్రజలకు ఇచ్చిన హామీలను అటకెక్కించాయని పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నూతన కమిటీ అధ్యక్షులను అభినందించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా మంది ప్రజలకు సంక్షేమ ఫలాలు పూర్తిగా అందలేదని అన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు తమ గ్రామాల్లో, వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సైనికునిలా పోరాటం చేయాలన్నారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవరకొండ సురేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో యడ్ల తాతాజీ, కోరాడ శ్రీనివాస్, మోర్త గిరీష్, బండి రమేష్, కృష్ణ, పాలపర్తి కృపానాథ్, బండి కొండ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు



నరసాపురం: పట్టణంలోని ఓ ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు



పాలకొల్లు సెంట్రల్: ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ రాజశేఖర్

నరసాపురం: పట్టణంలతో పాటు మండలంలో పలు గ్రామాల్లో ఉన్న ఎరువులు, పురుగుమందుల షాపులు, గోడౌన్స్‌లో శుక్రవారం విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గోదాముల్లోఉన్న ఎరువులు, పురుగుమందుల నిల్వ లు, రికార్డుల్లో ఎలా చూపిస్తున్నారు? అనే అంశాలను ఆరా తీశారు. పురుగు మందుల అక్రమ కొరతత సృష్టించడం, ధరలు పెంచి అమ్మడం లాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సహాయ వ్యవసాయ శాఖ సంచాలకుడు బుల్లి బాబు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సమెంట్ అధి కారి గోపాలకృష్ణ, మండల వ్యవశాయశాఖ అధికారి అడబాల జ్యోతి పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుత ఖరీఫ్ పంటకు సంబంధించి వ్యవసాయ పనులు కొనసాగుతున్నాయని, రైతులకు అవసరమైన ఎరువులు కొరత లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఎరువులు దుకాణాలు తనిఖీలు చేస్తున్నామని ఏఓ కె.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ రాజశేఖర్ మాట్లాడుతూ షాపులో ఉన్న రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులకు సంబంధించి ఫారం–ఓ ఉండాలని అన్నారు. ఫారం–ఓ ద్వారా అవసరమైన అనుమతులు ఉన్న ఎరువులు మాత్రమే విక్రయించాలన్నారు. అనుమతులు లేని ఎరువులు స్టాకు షాపుల్లో ఉంటే వాటికి అనుమతులు వచ్చే వరకూ విక్రయించరాదని వాటికి ఫారం–ఓ వచ్చే వరకూ విక్రయించకుండా సీజ్ చేస్తామని అన్నారు. ప్రస్తుతం షాపులు వద్ద రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, సూపర్, 1026, 2828, 1435, 2020 మరిన్ని కంపెనీలతో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా ఆచంట మండలంలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనికీ చేశారు. సార్వాసాగు నేపథ్యంలో ప్రభుత్వం బృందాలు ఏర్పాటు చేశామని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.బుల్లిబాబు తెలిపారు. తనికీల్లో కొడమంచిలిలో లక్ష్మీ రాఘవేంద్ర అగ్రో కెమికల్స్ దుకాణంలో రూ.3,67, 062 విలువైన బయో స్టిములేంట్స్ ఎరువులకు సరైన రికార్డులు లేనట్లు గుర్తించామన్నారు. రికార్డు అమెండ్ మెంట్ అయ్యే వరకూ ఎరువులు విక్రయించకూడదని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, మండలవ్యవసాయాధికారి బి.నాగరాజు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



ఎన్టీఆర్ కాలనీ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయ్

నరసాపురం: పీహెచ్‌సీలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసదుపాయాలు అందించాలని జిల్లా వైద్య అధికారి జి.గీతాబాయ్ ఆదేశించారు. శుక్రవారం ఆమె పట్టణంలోని మున్సిఫ్‌స్ట్రీట్, ఎన్టీఆర్ కాలనీ పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులకు పలు సూచనలు చేశారు. సమయానికి వైద్యులు విధులకు హాజరుకావాలన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ప్రస్తుతం వానాకాలం ప్రారంభమైన దృష్ట్యా సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీల్లో అందిస్తున్న సేవలపై ఫిర్యాదులు వస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఎస్‌వో సర్వేశ్వరరావు, డీపీహెచ్ వెంకటరమణారావు, పీహెచ్‌సీల అధికారులు మోహనలక్ష్మి, రంజిత్‌కుమార్ ఉన్నారు.

జాయింట్ ఎల్‌పీఎం పరిష్కారానికి గ్రామ సభలు



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

యలమంచిలి: రీ సర్వే పూర్తయిన గ్రామాలలో భూములు జాయింట్ ఎల్‌పీఎంలో ఉండిపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ, కౌలు రైతు కార్డు, పీఎం కిసాన్, తల్లికి వందనం వంటి పథకాలు అమలులో జాయింట్ ఎల్‌పీఎం కారణంగా రైతులకు ఆ పథకాలు మంజూరు కావడం లేదు. ఈ సమస్య పై జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గ్రామాలలో సభలు ఏర్పాటుచేసి జాయింట్ ఎల్‌పీఎం వల్ల ఇబ్బందులు పడుతున్న రైతుల నుంచి ఆన్‌లైన్ సబ్ డివిజన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చించినాడ సచివాలయంలో గ్రామ సభ ఏర్పాటుచేసి రైతుల నుంచి 10 అప్లికేషన్లు స్వీకరించారు. కాజ, మేడపాడు, శిరగాలపల్లి, బూరుగుపల్లి గ్రామాలలో శనివారం గ్రామ సభలు నిర్వహిస్తామని, జాయింట్ ఎల్‌పీఎం వలన ఇబ్బందులు పడుతున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పవన్ కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్ సన్, వీఆర్వో సరెళ్ల లక్ష్మి, గ్రామ సర్వేయర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న శాకంబరి అలంకరణ



దొడ్డిపట్లలో శాకంబరిగా కనకదుర్గమ్మ



పాలకొల్లులో శాకంబరిగా దేశాలమ్మ



నెగ్గిపూడిలో శాకంబరిగా వనమూలమ్మ

ఆషాఢ మాసం ఆఖరి శుక్రవారం కావడంతో అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా గ్రామ దేవతలను శాకంబరీ దేవిగా అలంకరించారు. కూరగాయలతో చేసిన అమ్మవార్ల అలంకరణ ఆకట్టుకుంది. - సాక్షి, నెట్‌వర్క్

ఇసుక దోపిడీకి అంతే లేదు



తూర్పుపాలెంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలో ఇసుక దోపిడీకి అంతే లేకుండా పోయిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ అడ్వయిజరీ కమిటీ సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. శుక్రవారం తూర్పుపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెజ్‌లో గ్రీన్ ట్రిబ్యునల్‌లో భాగంగా సిద్ధాంతం నుంచి నరసాపురం వరకూ ఇసుక తవ్వకాలపై నిషేధం ఉందన్నారు. ఇసుక తవ్వకాలు జరపడం వలన సముద్రపు నీరు వచ్చి నిర్మాణాలకు పని చేయదని, భూగర్భ జలాలు కాలుష్యానికి గురవుతాయని పర్యావరణ శాఖ హెచ్చరించిందని వివరించారు. ఇప్పటికే దొంగరావి పాలెం వరకూ సముద్రపునీరు చేరిందన్నారు. తవ్వకాల వలన త్వరలో బ్యారెజీ వరకూ సముద్ర పు జలాల పోటు ఉండే అవకాశం ఉందన్నారు. పర్యావరణ నిపుణుల హెచ్చరికలను పెడచెవిన పెట్టి ఇసుకను తోడేశారని ఆరోపించారు.

అక్రమ అమ్మకాలు

గోదావరికి నీరు రావడంతో అక్రమ నిల్వల్లో నుంచి అమ్మకాలు ప్రారంభించారన్నారు. ప్రజలను నిలువునా ముంచేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇసుక పై తీవ్ర ఆరోపణలు చేశారన్నారు. గుప్పెడ ఇసుక కూడ నియోజకవర్గంలో తీసుకోలేదని, అయినా, రాజకీయ ఆరోపణలు చేశారన్నారు. నేడు కూటమినాయకులు ఇసుక అమ్మకాలతో కోట్లాది రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. నడిపూడి నుంచి భీమలాపురం వరకూ ఇసుకను కూటమి నాయకులు పంచేసుకున్నారన్నారు. దీంతో రైతులకు సాగు నీరు అందక నానావస్థలు పడుతున్నారన్నారు. వరిచేలు బీడు భూములగా మారి నెరలు తీస్తున్నాయన్నారు. ఇసుక మీద ఉన్న దృష్టి సాగునీరుపై లేకుండాపోయిందన్నారు. ధాన్యం డబ్బులు జమ చేయలేదన్నారు. ఆచంట నియోజకవర్గ పరిశీలకులు ఖండవల్లి వాసు మాట్లాడుతూ కూటమి పాలన అధ్వానంగా ఉందన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. కార్యకర్తల ప్రచారం ద్వారానే కూటమి పాలనను ఎండగట్టగలుగుతామన్నారు.

చర్యలు తీసుకుంటాం

నియోజకవర్గంలో పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, పార్లమెంటు పరిశీలకుడు ముదునూ రి మురళీ కృష్ణంరాజులు హెచ్చరించారు. చర్యలు తీసుకోవాలంటూ పార్టీ నాయకులు విజ్ఞప్తి మేరకు స్పందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, దంపనబోయిన బాబూరావు, బి డెవిడ్ రాజు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, దండు పద్మావతి, గుబ్బల ఉషారాణి వీర బ్రహ్మం, ఎస్సీ సెల్ నాయకులు పలివెల శ్రీను, పార్టీ నాయకులు పోడూరి రామయ్య, కోట వెంకటేశ్వరరావు, కోట సరోజినీ తదితరులు పాల్గొన్నారు.


కాళీపట్నం భూముల పరిశీలన



కాళీపట్నంలో భూములను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలంలోని కాళీపట్నం రెవెన్యూ గ్రామ పరిధిలో పాతపాడు, జగన్నాథపురం, కాళీపట్నం తూర్పు, కాళీపట్నం పడమర, కొత్తోట గ్రామాల సెటిల్మెంట్ భూములు సంబంధించి శుక్రవారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఎంజాయిమెంట్ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ భూములకు సంబంధించిన మ్యాప్ లను పరిశీలించి, వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జగన్నాథపురం సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రికార్డులన్నీ ఎలాంటి పొరపాట్లు లేకుండా కచ్చితంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. గ్రామ కంఠం భూములకు సంబంధించిన అడంగల్ లో నమోదు చేసిన ఇళ్లకు సంబంధించి క్రయ, విక్రయాలు రిజిస్ట్రేషన్ వెసులుబాటు కల్పించాలని జేసీని రైతులు కోరారు. గ్రామ కంఠం భూములు సర్వే చేయించిన అనంతరం తగు చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో నరసాపురం ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ రాజాకిషోర్, జిల్లా కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్, మండల ల్యాండ్ సర్వేయర్ ఎ.దనరాజ్, డీటీ జి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కృష్ణారావు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తుందని మధ్యాహ్న భోజన, పారిశుధ్య జిల్లా సమన్వయకర్త కె. కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలో కొత్తపేట స్పెషల్ మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం విక్రాంత్ విజయ్, జీవీఎస్‌వీఆర్ఎం పాఠశాల హెచ్ఎం భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల నిర్వహణ




విద్యార్థితో చెస్ ఆడుతున్న ఆర్డీఓ రాజు

పాలకొల్లు సెంట్రల్: అంతర్జాతీయ చెస్ డే సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం పోటీలు నిర్వహించారు. స్థానిక యూరో కిడ్స్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీలను నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ప్రారంభించారు. జిల్లా చెస్ అధ్యక్షుడు ఎం.కిషోర్ మాట్లాడుతూ అండర్ 5, 7, 9, 11, 13, 15 కేటగిరీల్లో బాలురు, బాలికల విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 78 క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. ఆయా విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచినవారికి బహుమతులను అందించారు.

నేత్రదానం

యలమంచిలి: మండలంలోని శిరగాలపల్లి గ్రామానికి చెందిన గన్నమనీడి సోమరాజు (50) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. ఆయన పాలకొల్లులో ఆటోమొబైల్ షాపు నిర్వహిస్తూ క్షీరపురి టూ వీలర్స్ ఆటోమొబైల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సోమరాజు కోరిక మేరకు అతని నేత్రాలను నిడదవోలు పట్టణానికి చెందిన శ్రీ రాజేశ్వరి రామకృష్ణ నేత్ర వైద్య శాల సిబ్బంది వచ్చి సేకరించారు. నేతదానానికి సహకరించిన సోమరాజు కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

ఎన్‌సీసీ విద్యార్థినికి సిల్వర్ మెడల్



ధనలక్ష్మి

పాలకొల్లు సెంట్రల్: చాంబర్స్ కళాశాల విద్యార్థినులు జాతీయ, రాష్ట్రీయ ఎన్‌సీసీ క్యాంపులకు ఎంపికై జాతి సమగ్రతను అలవర్చుకుంటున్నారని కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు అన్నారు. శుక్రవారం స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్ సీసీ విద్యార్థిని ధనలక్ష్మి నేషనల్ లెవెల్ షిప్ మోడలింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా ధనలక్ష్మిని అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, కళాశాల సెక్రటరీ సీతారామరాజు, రేపాక ప్రవీణ్‌భాను పాల్గొన్నారు.

రేపు పాలకొల్లులో దివ్యాంగులకు పరికరాల పంపిణీ

భీమవరం(ప్రకాశంచౌక్): దివ్యాంగుల కోసం అవసరమైన ఉచిత ఉపకరణాల ఎంపిక, గుర్తింపు శిబిరాన్ని ఆదివారం పాలకొల్లులో నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తాను బాధ్యత నిర్వర్తిస్తున్న ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన సెయిల్ నుంచి రూ.50 లక్షల రూపాయల సీఎస్ఆర్ నిధులను ఈ కార్యక్రమం కోసం మంజూరు చేయించామని పేర్కొన్నారు. పాలకొల్లులోని మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.